ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక



## లోక్‌సభ ఎన్నికల వేళ.. చివరి కేంద్ర మంత్రిమండలి భేటీ

2లో..

సంపుటి: 1 | సంచిక: 319 | పేజీలు: 4 | వెల: రూ.3/- | శుక్రవారం 23 ఫిబ్రవరి 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్

# మరో రెండు గ్యారంటీల అమలుకు ముహూర్తం ఫిక్స్

### గృహజ్యోతి, గ్యాస్ సిలిండర్ పథకాల అమలు
### 27 లేదా 29న అమలుకు రంగం సిద్ధం
### కేబినేట్ సబ్‌కమిటీలో సీఎం రేవంత్ చర్చ
### విధివిధానాలపై సమగ్రంగా సమీక్ష



హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ప్రభాత ఉదయం): గృహలక్ష్మి, రూ.500లకు గ్యాస్ సిలిండర్ పథకాల అమలుకు వెంటనే సన్నాహాలు చేయాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 27వ తేదీ లేదా 29వ తేదీన ఈ రెండు పథకాలను ప్రారంభించాలని సూచనప్రాయంగా నిర్ణయించారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులందరికీ లబ్ధి జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి కేబినేట్ సబ్ కమిటీతో సమీక్ష నిర్వహించారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం అందించే మహాలక్ష్మి, ఆరోగ్య శ్రీ పరిమితిని రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచే పథకాలు ఇప్పటికే అమల్లోకి వచ్చాయి. ఇప్పుడు మరో రెండు గ్యారంటీలుగా గృహలక్ష్మి, గ్యాస్ సిలిండర్ పథకాలను అమలు చేయాలని సీఎం నిర్ణయించారు. ఈ రెండు పథకాల అమలుకు సంబంధించిన ఏర్పాట్లు, అనుసరించాల్సిన విధి విధానాలపై చర్చించారు. ప్రజా పాలన దరఖాస్తుదారుల్లో అర్హులందరికీ రూ. 500కు గ్యాస్ సిలిండర్ అందించాలని సీఎం అధికారులకు సూచించారు. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీని నేరుగా లబ్ధిదారుల ఖాతాకు బదిలీ ..మిగతా 2లో



## వేసవిలో నీటి సమస్యలపై సీఎం రేవంత్ ప్రత్యేక దృష్టి

### తాగు నీటి సరఫరాలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్ష

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ప్రభాత ఉదయం): వేసవి కాలంలో తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని, ఇందుకు అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వర్షాభావంతో జలాశయాలు డెడ్‌స్టోరేజీకి చేరుకున్న నేపథ్యంలో తాగు నీటి సరఫరాలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్షించారు. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సాగు నీరు,పట్టణాభివృద్ధి, పురపాలక, పంచాయతీరాజ్, తాగు నీటి సరఫరా శాఖల అధికారులు పాల్గొన్నారు. తొలుత రాష్ట్రంలో జలాశయాల్లో నీటి నిల్వలు, తాగు నీటికి అవసరమైన నీటి పరిమాణంపై అధికారులు గణాంకాలు వివరించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందిస్తూ నగరాలు/పట్టణాలు, పల్లెలు,తండాలు, గూడాలు, ఎస్సీ కాలనీలు అనే తేడా లేకుండా ప్రతి నివాస ప్రాంతానికి తాగు నీరు అందేలా సాగు నీరు, పట్టణాభివృద్ధి, పురపాలక, పంచాయతీరాజ్, తాగు నీటి సరఫరా శాఖలకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక ..మిగతా 2లో


## గొర్రెల పంపిణీ పథకంలో భారీ అవినీతి

### నలుగురు అధికారులను అరెస్టు చేసిన ఏసీబీ
### చంచల్‌గూడ జైలుకు తరలింపు



హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ప్రభాత ఉదయం): గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన గొర్రెల పంపిణీ పథకంలో అవినీతి ప్రకంపనలు రేపుతోంది. గొర్రెల పంపిణీ స్కీమ్ స్కామ్‌లో నలుగురు ప్రభుత్వ ఉద్యోగులను యాంటీ ..మిగతా 2లో

## మేడారం జాతరకు వెళ్లనున్న సీఎం రేవంత్, గవర్నర్ తమిళసై



మేడారం ఫిబ్రవరి 22 (ప్రభాత ఉదయం): తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి చెందిన సమ్మక్క-సారలమ్మ జాతర బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మేడారం మహా జాతరకు సీఎం రేవంత్ రెడ్డి వెళ్లనున్నారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి మేడారం పర్యటన షెడ్యూల్ ఖరారైంది. ఈ నెల 23వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి మేడారం సందర్శించనున్నట్టు ప్రభుత్వ వర్గాల సమాచారం. రేవంత్ రెడ్డి తొలిసారి సీఎం హెూదాలో మేడారం జాతరకు వెళ్లి.. వనదేవతలను దర్శించుకోనున్నారు. అదే రోజు తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ కూడా జాతరకు హాజరుకానున్నట్టు సమాచారం.

## మేడారం జాతరకు అంతర్జాతీయ గుర్తింపు కోసం ప్రయత్నిస్తాం: కిషన్‌రెడ్డి



ములుగు, ఫిబ్రవరి 22 (ప్రభాత ఉదయం): మేడారం జాతరకు అంతర్జాతీయ గుర్తింపు కోసం ప్రయత్నిస్తామని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. మేడారం జాతరను జాతీయ పండుగగా నిర్వహించాలని చాలా మంది అడుగుతున్నారని, జాతీయ పండుగ విధానం అనేది ఎక్కడా లేదని ఆయన స్పష్టం చేశారు. సమ్మక్క, సారలమ్మ జాతర సందర్భంగా అమ్మవార్లను గురువారం ఆయన దర్శించుకున్నారు. అనంతరం నిలువెత్తు బంగారాన్ని(బెల్లం) సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. ముందుగా ములుగు జిల్లాలో పర్యటించిన కిషన్‌రెడ్డి గట్టమ్మ ఆలయాన్ని ..మిగతా 2లో

## కరెంట్ కట్ చేస్తే.. సస్పెన్షనే

### ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే కుట్రలను సహించం
### విద్యుత్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంపై సీఎం రేవంత్ ఆగ్రహం



హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ప్రభాత ఉదయం): రాష్ట్రంలో ఎక్కడైనా అకారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే బాధ్యులైన అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఇప్పుడున్న అవసరాలకు సరిపడేంత విద్యుత్తును ప్రభుత్వం సరఫరా చేస్తోందని, ప్రభుత్వం తరపున ఎక్కడా విద్యుత్తు కోతలను విధించటం లేదని సీఎం స్పష్టం చేశారు. గతంతో పోలిస్తే రాష్ట్రంలో విద్యుత్తు సరఫరా పెరిగిందని చెప్పారు. ఇటీవల పలుచోట్ల విద్యుత్తు సరఫరా నిలిపేసిన సంఘటనలపై ముఖ్యమంత్రి విద్యుత్తుశాఖ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ మండిపడ్డారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేందుకు, విద్యుత్తుపై దుష్ప్రచారం చేసేందుకు కొందరు కుట్రలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. అటువంటి అధికారులు, సిబ్బందిపై కఠిన ..మిగతా 2లో

## మేడారానికి పూనకం..

### వనం వీడి జనం మధ్యకు సమ్మక్క



ములుగు, ఫిబ్రవరి 22 (ప్రభాత ఉదయం) మేడారం మహా జాతర అత్యంత కోలాహలంగా సాగుతోంది. సమ్మక్క-సారలమ్మల నామస్మరణతో కీంకారణ్యం పులకించిపోతోంది. అశేష జనవాహినికి అభయమిచ్చేందుకు ఆదివాసీల ఇలవేల్పు సమ్మక్క చిలకలగుట్ట నుంచి గద్దెలపైకి చేరుకుంది. సమ్మక్క తల్లి నామస్మరణతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. మేడారం మహా జాతరలో అత్యంత కీలకఘట్టం సమ్మక్క ఆగమనమే. సమ్మక్క ఆగమనం కోసం ఉదయమే ఏర్పాట్లు మొదలయ్యాయి. పూజారులు అడవి నుంచి వెదురు వనం, అడెరాలు తెచ్చి గద్దెపై ఉంచారు. సాయంత్రం ప్రధాన పూజారి నేతృత్వంలో పూజాలరుల బృందం చిలుకలగుట్ట అడవికి వెళ్లింది. అక్కడి నుంచి గుట్టుపైకి ప్రధాన పూజారి ఒక్కరే వెళ్లారు. అక్కడ పూజా తంతు అంతా ఆనవాయితీ ప్రకారం గోప్యంగా సాగింది. ఆ తర్వాత తల్లిని తీసుకొని కిందికి దిగారు. సమ్మక్క గద్దెలపైకి రాగానే జిల్లా ఎస్పీ గౌరవసూచకంగా గాల్లో కాల్పులు జరపడం ఆనవాయితీగా వస్తోంది. సమ్మక్క రాకను సూచించే ఈ శబ్దంతో ఒక్కసారిగా చిలకలగుట్ట ప్రాంతం భక్తిభావంతో ఉప్పొంగిపోయింది. ప్రభుత్వం తరపున మంత్రి సీతక్క స్వాగతం పలికారు. ఆమె రాక కోసం తనువెల్లా కళ్లు చేసుకొని ఎదురు చూసిన యావత్ భక్తకోటి%ౌ% ఆమె గుట్ట దిగగానే జేజేలు పలికారు. సమ్మక్కను చిలకల గుట్ట నుంచి దాదాపు 2 కిలోమీటర్ల పొడవునా డోలు వాద్యాలు, గిరిజన సంప్రదాయ నృత్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చారు. డప్పు చప్పుళ్లు, డోలు వాద్యాలు మారుమోగుతుంటే అడవిని వీడి సమ్మక్క జనం మధ్యకు వచ్చి గద్దెలపైకి చేరింది. తొలిరోజు వనదేవతల గద్దెలపైకి రావడం ఆద్యంతం సందడిగా సాగింది. కన్నెపల్లి నుంచి సారలమ్మ అమ్మవారిని ఆదివాసీ ..మిగతా 2లో

# మరో రెండు గ్యారంటీల అమలుకు ముహూర్తం ఫిక్స్

మొదటి పేజీ తరువాయి...

చేయాలా.. ఏజెన్సీలకు చెల్లించాలా..? అందుకు ఉన్న అడ్డంకులు, ఇబ్బందులు, సాధ్యాసాధ్యాలపై సివిల్ సప్లయిస్, ఆర్థిక శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎలాగైనా సరే లబ్ధిదారుడు రూ.500 చెల్లిస్తే సిలిండర్ ఇచ్చేటట్లు చూడాలని, ప్రజలకు అనువైన విధానాన్నిఅనుసరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. అవసరమైతే గ్యాస్ సిలిండర్ పంపిణీ చేసే ఏజెన్సీలతో చర్చలు జరపాలని సూచించారు. ప్రభుత్వం తరఫున చెల్లించాల్సిన సబ్సిడీ నిధులను వెంట వెంటనే వారికి చెల్లించేందుకు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. అనుమానాలు, అపోహాలకు తావు లేకుండా గృహలక్ష్మి పథకాన్ని పారదర్శకంగా అమలు చేయాలని సీఎం విద్యుత్తు శాఖ అధికారులను ఆదేశించారు. తెల్ల రేషన్ కార్డు ఉండి, 200 యూనిట్ల లోపు గృహ విద్యుత్తు వినియోగించే వారందరికీ ఈ పథకం వర్తింపజేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మార్చి మొదటి వారం నుంచి విద్యుత్తు బిల్లు జారీ చేసేటప్పుడు అర్హులైన వారందరికీ గృహలక్ష్మి పథకం కింద జీరో బిల్లులు జారీ చేయాలని సూచించారు. ప్రజా పాలనలో ఇచ్చిన దరఖాస్తుల్లో కార్డు నెంబర్లు, కనెక్షన్ నెంబర్ల తప్పుల కారణంగా జీరో బిల్లుకు అర్హత కోల్పోయిన వారెవరైనా ఉంటే.. సవరించుకునే అవకాశమివ్వాలని సీఎం సూచించారు. విద్యుత్తు బిల్లు కలెక్షన్ సెంటర్లు, సర్వీస్ సెంటర్లన్నింటా ఈ సవరణ ప్రక్రియను చేపట్టాలని చెప్పారు. అందుకు సంబంధించి ప్రతి గ్రామంలోనూ ప్రజలందరికీ తెలిసేలా విద్యుత్తు శాఖ ఫ్లెక్సీల ద్వారా



తగినంత ప్రచారం కూడా చేపట్టాలన్నారు. తప్పులను సవరించుకున్నఅర్హులందరికీ తదుపరి నెల నుంచి ఈ పథకం వర్తింపజేయాలని చెప్పారు. అర్హులందరికీ ఈ పథకంలో లబ్ధి జరిగేలా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని సీఎం స్పష్టం చేశారు. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకోని వారుంటే ఎంపీడీవో, తహసీల్దార్ ఆఫీసుల్లో దరఖాస్తు చేసుకునే అవకాశం నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణ రావు, సివిల్ సప్లయిస్ కమిషనర్ డీఎస్ చౌహాన్, ట్రాన్స్ కో, జెన్ కో సీఎండీ రిజ్వీ, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## గొర్రెల పంపిణీ పథకంలో భారీ అవినీతి

మొదటి పేజీ తరువాయి...

కరప్షన్ బ్యూరో అధికారులు అరెస్టు చేశారు. ప్రైవేట్ వ్యక్తులతో కుమ్మక్కై.. నకిలీ పత్రాలు, బ్యాంక్ ఖాతాలు సృష్టించి సుమారు రూ. 2.10 కోట్ల ప్రభుత్వ నిధులను పక్కదారి పట్టించారని ఏసీబీ అధికారుల దర్యాప్తులో తేలింది. అరెస్టైన వారిలో కామారెడ్డి వెటర్నరీ ఆసుపత్రి అసిస్టెంట్ డైరెక్టర్ రవి, మేడ్చల్ పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఆదిత్య, రంగారెడ్డి జిల్లా భూగర్భ జల అధికారి రఘుపతిరెడ్డి, వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ గణేష్ ఉన్నారు. నలుగురు నిందితులకు నాంపల్లి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. మార్చ్ 7 వరకు జ్యుడిషియల్ రిమాండ్ విధించడంతో.. పోలీసులు చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఎనుముల రేవంత్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గత ప్రభుత్వంలో వివిధ శాఖలు, పథకాల్లో జరిగిన అవినీతిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ఇప్పటికే కాళేశ్వరం ప్రాజెక్టు, విద్యుత్తు రంగాలకు సంబంధించి పెద్ద ఎత్తున అవినీతి జరిగినట్లు ఆరోపణలు వస్తుండగా.. గొర్రెల పంపిణీ పథకంలోనూ అక్రమాలు జరిగినట్లు తేలడం ఆందోళన కలిగిస్తోంది. రూ. 12,000 కోట్ల బడ్జెట్‌తో 2017 జూన్ 20న నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ పథకాన్ని ప్రారంభించారు. సిద్ధిపేట జిల్లా గజ్వేల్ సమీపంలోని కొండపాకలో ఈ పథకాన్ని ప్రారంభించారు. ఒక్కో యూనిట్‌కు 21 గొర్రెలకు గాను రూ. 1,25,000 ఇచ్చారు. ఆ తర్వాత యూనిట్ ధరను రూ.1,75,000కు పెంచారు. ఇందులో రూ. 1,31,250ను రాష్ట్ర ప్రభుత్వం భరించగా.. రూ. 43,750ను లబ్దిదారుడు భరించారు. ఈ పథకంలో పొందిన గొర్రెలు ప్రమాదవశాత్తూ మరణిస్తే ప్రభుత్వం ఒక్కో గొర్రెకు రూ. 5,000 ఇన్సూరెన్స్ ఇచ్చింది. పొట్టేలుకు రూ.7 వేల ఇన్సూరెన్స్ అందించింది. గొర్రెలు చనిపోయిన 10 రోజుల్లోనే ఈ ఇన్సూరెన్స్ డబ్బులను లబ్దిదారుల ఖాతాల్లో జమ చేస్తామని చెప్పారు. ఈ పథకంలో పలు దశల్లో అక్రమాలు జరిగినట్లు వెలుగులోకి వస్తున్నాయి. గొర్రెల పంపిణీ కుంభకోణానికి సంబంధించిన కేసును ఏసీబీ దర్యాప్తు చేస్తోంది.

## లోక్‌సభ ఎన్నికల వేళ.. చివరి కేంద్ర మంత్రిమండలి భేటీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి, 22 (ప్రభాత ఉదయం): లోక్‌సభ ఎన్నికల 2024 ప్రకటనకు కొన్ని రోజుల ముందు మార్చి 3న ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రి మండలి సమావేశం జరుగనున్నది. ఈ మేరకు బుధవారం అధికారులు సమాచారం అందించారు. ఢిల్లీలోని చాణక్యపురి డిప్లొమాటిక్ ఎన్‌క్లేవ్‌లో ఉన్న సుష్మా స్వరాజ్ భవన్‌లో మంత్రి మండలి సమావేశం జరుగుతుందని వెల్లడించారు. కీలకమైన విధానపరమైన అంశాలను చర్చించడానికి, వివిధ కార్యక్రమాల అమలుపై ఇన్‌పుట్‌లను కోరడానికి, పాలనకు సంబంధించిన విషయాలపై తన దృక్పథాన్ని పంచుకోవడానికి ప్రధాని ఎప్పటికప్పుడు పూర్తిస్థాయి మంత్రుల మండలి సమావేశాలకు అధ్యక్షత వహిస్తున్నారు. అయితే.. సార్వత్రిక ఎన్నికల ప్రకటనకు ముందు ఈ భేటీ జరగనుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. మరోవైపు.. లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు వివిధ రాష్ట్రాల సన్నాహాలను ఎన్నికల సంఘం సమీక్షించడం ప్రారంభించింది. వచ్చే నెలలో ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉంది. 2014లో మార్చి 5న తొమ్మిది దశల్లో ఎన్నికల సంఘం లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. మే 16న ఫలితాలను ప్రకటించింది. 2019 సంవత్సరంలో కమిషన్ ఏడు దశల లోక్‌సభ ఎన్నికలను మార్చి 10న ప్రకటించింది . మే 23న ఫలితాలను ప్రకటించింది. ఈసారి ఎన్డీయే 400 దాటుతుందని, బీజేపీ 370కి పైగా సీట్లు గెలుచుకుంటుందని ప్రధాని మోదీ ప్రకటించారు. 'సబ్కా సాత్, సబ్కా వికాస్ తమ లక్ష్యమని అన్నారు. నేడు ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా భారత్‌పై అపూర్వమైన సానుకూలత కనిపిస్తోందని అన్నారు. భారతదేశ వృద్ధి కథనంపై ప్రతి దేశం విశ్వాసంతో, పూర్తి విశ్వాసంతో ఉంది. నేడు దేశంలో మోడీ హామీపై జోరుగా చర్చ జరుగుతోంది. నేడు ప్రపంచం మొత్తం భారతదేశాన్ని పెట్టుబడులకు కేంద్రంగా పరిగణిస్తోందనీ, తమ ప్రభుత్వం అందరి కోసం. 'సబ్కా సాథ్, సబ్‌కా వికాస్' అనే లక్షంతో పని చేస్తుందని అన్నారు.

## కరెంట్ కట్ చేస్తే సస్పెన్షనే

మొదటి పేజీ తరువాయి...

చర్యలు తీసుకుంటామని సీఎం హెచ్చరించారు. గతంతో పోల్చితే విద్యుత్ సరఫరా పెంచినప్పటికీ, కోతలు పెడుతున్నారంటూ జరుగుతున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాల్సిన బాధ్యత మీదేనని విద్యుత్తు శాఖ అధికారులను ముఖ్యమంత్రి అప్రమత్తం చేశారు. సచివాలయంలో గృహజ్యోతి, రూ.500కే సిలిండర్ పథకాలపై సమీక్షకు ముందు ముఖ్యమంత్రి విద్యుత్ కోతలపై సాగుతున్న ప్రచారంపై అధికారులను ప్రశ్నించారు. గతేడాదితో పోల్చితే గత రెండు నెలల్లో విద్యుత్ సరఫరా ఎక్కువగా చేసినట్లు ట్రాన్స్ కో, జెన్ కో సీఎండీ రిజ్వీ సమాధాన మిచ్చారు. ఇటీవల రాష్ట్రంలో మూడు సబ్ స్టేషన్ల పరిధిలో కొంత సేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందని తెలిపారు. దానికి కారణాలు ఏమిటని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. సబ్ స్టేషన్లలో లోడ్ హెచ్చుతగ్గులను డీఈలు సరి చూసుకుంటూ ఉండాలని, అలా చూసుకోకపోవడంతో సమస్య తలెత్తిందని అధికారులు తెలియజేశారు. నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఏవైనా మరమ్మతులు, ఇతర అంశాలకు సరఫరా నిలిపివేయాల్సి వస్తే ముందుగానే ఆయా సబ్ స్టేషన్ల పరిధిలోని వినియోగదారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో నియమితులైన కొందరు క్షేత్రస్థాయి సిబ్బంది అత్యుత్సాహంతో ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేందుకు ఉద్దేశ్యపూర్వకంగా కోతలు పెడుతున్నారనే సమాచారం తమకు ఉందని సీఎం హెచ్చరించారు. ఎక్కడైనా అయిదు నిమిషాలకు మించి విద్యుత్ సరఫరా నిలిచిపోతే అందుకు గల కారణాలపై వెంటనే సమీక్షించుకోవాలని చెప్పారు. సాంకేతిక, ప్రకృతిపరమైన కారణాలు మినహా ఉద్దేశపూర్వకంగా ఎవ రైనా కోతలకు కారణమైతే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశిం చారు. రాష్ట్రంలో డిమాండ్‌కు అనుగుణంగా సరిపడేంత విద్యుత్తును అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టింది. విద్యుత్తు అవసరం ఎక్కువగా ఉండే ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ మాసాల్లో పీక్ సీజన్ కు సరిపడేంత విద్యుత్తును అందించే కార్యాచరణను ఇప్పటికే సిద్ధం చేసుకుంది. ఫిబ్రవరిలో ఒకటో తేదీ నుంచి 13వ తేదీ వరకు రోజుకు 264.95 మిలియన్ యూనిట్ల విద్యుత్తు సరఫరా అయింది. గత ఏడాది అదే వ్యవధిలో 242.44 మిలియన్ యూనిట్లు మాత్రమే సరఫరా జరిగింది. నిరుడు జనవరిలో 230.54 మిలియన్ యూనిట్లు సరఫరా కాగా, ఈ ఏడాది జనవరిలో అంతకంటే ఎక్కువగా 243.12 మిలియన్ యూనిట్లు సరఫరా అయింది.

## వేసవిలో నీటి సమస్యలపై సీఎం రేవంత్ ప్రత్యేక దృష్టి

మొదటి పేజీ తరువాయి...

రూపొందించాలని అధికారులను ఆదేశించారు. తాగు నీటి కోసమంటూ నాగార్జున సాగర్ నుంచి ఆంధ్రప్రదేశ్ 9 టీఎంసీలకుపైగా నీరు తీసుకుపోతోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అంత పెద్ద మొత్తంలో తాగు నీరు ఎక్కడ వినియోగిస్తున్నారని, సరైన గణాంకాలు తీసుకొని ఇతర అవసరాలకు నీరు తీసుకుపోకుండా చూడాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల నుంచి తాగు నీటి జలాలు తీసుకోవాలంటే కృష్ణా నది యాజమాన్య బోర్డుకు (కేఆర్ఎంబీ) లేఖ రాయాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. ఎంత నీరు అవసరమో సమగ్రంగా సమీక్షించి వెంటనే కేఆర్ఎంబీకి లేఖ రాయాలని ముఖ్యమంత్రి సూచించారు. గతంలో ఏప్రిల్ నెలాఖరు, మే నెలలో వచ్చిన వర్షాలతో జూరాలకు నీరు రావడంతో ఇబ్బంది రాలేదని, లేకుంటే నారాయణపూర్ జలాశయం నీరు విడుదల కోరుతూ కర్ణాటకను అభ్యర్థించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. గతంలో ఎప్పుడైనా అలా తీసుకున్నారా అని ముఖ్యమంత్రి ప్రశ్నించగా మూడేళ్ల క్రితం తీసుకున్నామని తెలిపారు. అయితే దానిని చివరి అవకాశంగా తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ముందుగా కేఆర్ఎంబీకి లేఖ రాయాలని సూచించారు. నూతన పథకాలు వచ్చిన తర్వాత గతంలో ఉన్న అనేక నీటి వనరులను వదిలేశారని, ప్రస్తుతం వాటిని వినియోగంలోకి తెచ్చే అవకాశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఈసందర్భంగా కాగ్నా నదిని ముఖ్యమంత్రి ఉదాహరించారు. కాగ్నా నుంచి తాండూర్, కొడంగల్ నియోజకవర్గాలకు నీరు వినియోగించుకునే అవకాశం ఉందని, మిషన్ భగీరథ వచ్చిన తర్వాత దానిని వదిలేశారని, అటువంటివి రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లో ఉంటాయని వాటిని వినియోగించుకోవాలన్నారు. అలాగే అవసరమైన చోట తాగు నీటి బోర్లు, బావులు, మోటార్లకు మరమ్మతులు చేయించాలని, ఇందుకు ఎమ్మెల్యేలకు కేటాయించిన ఏసీడీపీ నిధుల నుంచి రూ.కోటి, అవసరమైతే అంతకన్నా ఎక్కువగా వినియోగించుకోవాలని సూచించారు. తాను ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించినప్పుడు అనేక గ్రామాల్లో తాగు నీటి సరఫరా లేదని, మిషన్ భగీరథ ద్వారా 99 శాతం ఇళ్లకు నీళ్లు ఇచ్చామని గత ప్రభుత్వం కేంద్రానికి తప్పుడు నివేదికలు ఇచ్చినందునే జల్ జీవన్ మిషన్ కింద రాష్ట్రానికి నిధులు రావడం లేదని ముఖ్యమంత్రి అన్నారు. గొప్పలకు పోయి తప్పుడు నివేదికలు ఇవ్వవద్దని, క్షేత్ర స్థాయిలో పరిశీలించి వాస్తవ నివేదికలు కేంద్రానికి పంపించాలని ఆయన అధికారులను ఆదేశించారు. జులై నెలాఖరు వరకు ఎక్కడ తాగు నీటి సమస్య తలెత్తకుండా చూసేందుకు ఆయా జిల్లాల్లో ఉన్న నీటి వనరులు, అవసరమైన తాగు నీటి పరిమాణం, సమస్యలు అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్లతో రెండు రోజుల్లో సమీక్ష నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈసందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ పరిధిలో సిబ్బందికి వేతనాలు ఇవ్వడం లేదనే వార్తలు వస్తున్నాయని ముఖ్యమంత్రి అన్నారు. గత రెండేళ్లుగా జీతాలు ఇవ్వడం లేదని అధికారులు తెలిపారు. వేతన బకాయిలపై ఆరా తీసిన ముఖ్యమంత్రి క్షేత్ర స్థాయి సిబ్బందికి వేతనాలు అందేలా ఆర్థిక శాఖ నుంచి నిధులు విడుదల చేయాలని ఆదేశించారు. తాము నిధులు విడుదల చేస్తామని వాటిని బడా బాబులకు ఇవ్వకుండా క్షేత్ర స్థాయి సిబ్బందికి అందేలా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు.

### జీహెచ్ఎంసీ పరిధిలోనూ..

గ్రేటర్ హైదరాబాద్ నగర పాలక సంస్థ పరిధిలోనూ తాగు నీటికి ఎటువంటి సమస్య లేకుండా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పెద్దగా ఇబ్బందులు లేవని, ఏదైనా కొరత ఏర్పడితే ఎల్లంపల్లి, నాగార్జున సాగర్ నుంచి కొంతమేర తెప్పించుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. నగరంలోని నీటి అవసరాలపై సూక్ష్మ స్థాయి (మైక్రోలెవల్)లో సమీక్షించి తగిన ప్రణాళిక రూపొందించుకోవాలని సీఎం సూచించారు. నగరంలో కొన్ని ప్రాంతాల్లో ట్యాంకర్ల రాకపోకలకు పోలీసుల నుంచి కొంత ఇబ్బంది ఉందని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వేసవి పూర్తయ్యే వరకు తాగు నీటి ట్యాంకర్ల రాకపోకల విషయంలో పోలీసుల నుంచి ఇబ్బంది లేకుండా చూడాలని పోలీసు ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

## మేడారం జాతరకు అంతర్జాతీయ గుర్తింపు కోసం ప్రయత్నిస్తాం: కిషన్‌రెడ్డి

మొదటి పేజీ తరువాయి...

సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కేంద్రీయ విశ్వ విద్యాలయానికి ఎంపిక చేసిన స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. మరోసారి బీజేపీ అధికారంలోకి రాగానే దేశ వ్యాప్తంగా గిరిజన రిజర్వేషన్లు అమలు చేస్తామని వెల్లడించారు. ములుగులో గిరిజన వర్సిటీ తాత్కలిక క్యాంపస్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. వర్సిటీలో ఎక్కువ సీట్లు తెలంగాణ విద్యార్థులకు కేటాయించేలా చూస్తామని పేర్కొన్నారు.



## దూకుడు పెంచిన కమలనాథులు

### పల్లె పల్లెలో విజయ సంకల్ప యాత్రలు

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ప్రభాత ఉదయం): తెలంగాణలో రోజురోజుకు లోక్‌సభ ఎన్నికల పోరు వేడి పెరుగుతోంది. టార్గెట్ 370 అని మోదీ అంటుంటే.. వై నాట్ 17 అంటున్నారు తెలంగాణ నేతలు. అసెంబ్లీ ఎన్నికల్లో ఫలితాలు నిరాశపరిచినా.. పార్లమెంట్ ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు గెలిచేలా కసరత్తు చేస్తున్నారు కమలనాథులు. ఈ క్రమంలో తెలంగాణ వ్యాప్తంగా విజయ సంకల్ప యాత్రలకు శ్రీకారం చుట్టారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా తెలంగాణ భారతీయ జనతా పార్టీ విజయ సంకల్ప యాత్రను ప్రారంభించింది. ఇందులో భాగంగా మునుగోడు నియోజకవర్గంలో విజయసంకల్పయాత్ర గ్రాండ్‌గా ప్రారంభించారు బీజేపీ నేతలు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో 15 ఎంపీ సీట్లు కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేస్తున్నారు బీజేపీ నేతలు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన విజయ సంకల్ప యాత్రలో కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకట రమణా రెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ పాల్గొన్నారు. రాజకీయ విమర్శలు లేకుండా ఎంతో భిన్నంగా తెలంగాణ వ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ విజయసంకల్ప సభ సాగుతోంది. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పొత్తు ఉండదని తేల్చి చెబుతున్న తెలంగాణ బీజేపీ నేతలు.. బీఆర్ఎస్ గెలవడం వల్ల ఎలాంటి లాభం ఉండదని అంటున్నారు. కేంద్రంలో మోదీ సర్కార్ దేశ ప్రజలకు అందిస్తున్న పథకాలను వివరిస్తున్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ, ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన, జల్ జీవన్ మిషన్, కిసాన్, జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్, ఆయుష్మాన్ భారత్, %ఉవీ% ఉజ్వల, ప్రధాన మంత్రి కిసాన్ ఎనర్జీ సెక్యూరిటీ వంటి అనేక కేంద్ర పథకాలను తీసుకువచ్చిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందన్నారు. లోక్ సభ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థులకే పట్టం కట్టాలని నేతలు కోరారు.

## తెలంగాణలో బీజేపీ ఒంటరి పోరే!

### పొత్తులపై రాష్ట్ర నేతలకు స్పష్టతనిచ్చిన బీజేపీ అధిష్టానం




హైదరాబాద్, ఫిబ్రవరి, 22 (ప్రభాత ఉదయం): వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో ఒంటరి పోరుకే బీజేపీ మొగ్గుచూపింది. బీఆర్ఎస్‌తో పొత్తు ఉందంటూ జరుగుతున్న విస్తృత ప్రచారానికి తెరదించేందుకు సిద్ధమైంది. పార్లమెంటు ఎన్నికల్లో ఇక్కడ సొంతంగానే పోటీచేస్తామని.. బీఆర్ఎస్‌తో పొత్తుగానీ, ఎలాంటి అవగాహనగానీ ఉండదని ప్రజలకు చాటాలని తెలంగాణ బీజేపీ నేతలకు స్పష్టం చేసింది. దీనిపై కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్‌లకు పలు సూచనలు చేసినట్టు పార్టీ వర్గాలు చెప్తున్నాయి. ఈ క్రమంలోనే బీజేపీ విజయ సంకల్పయాత్రలను ప్రారంభించి.. అందరికన్నా ముందుగా ఎన్నికల సమరం ప్రారంభించిందని వివరిస్తున్నాయి.

## మేడారానికి పూనకం.. వనం వీడి జనం మధ్యకు సమ్మక్క

మొదటి పేజీ తరువాయి...

పూజారులు డోలు వాయిద్యాలతో తోడ్కొని వచ్చి గద్దెలపై ప్రతిష్ఠించారు. పగిడిద్దరాజు, గోవిందరాజులనూ గద్దెలపై కొలువుదీర్చారు. ఇక గద్దెలపైన కొలువైన వనదేవతలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు తరలివస్తున్నారు. జంపన్నవాగు జనసంద్రమైంది. కీకారణ్యం కోలాహలంగా మారింది. ఇది జనమా %--% వనమా అనట్లు మేడారం అభయారణ్యం మొత్తం జనారణ్యంగా మారిపోయింది. ఎడ్ల బండ్ల నుంచి మొదలుకొని హెలికాప్టర్ల వరకు మేడారానికి కదిలారు. అశేష జనవాహినితో కీకారణ్యం కొత్త శోభను సంతరించుకుంది. భక్తులు జంపన్న వాగులో పుణ్యస్నానాలాచరిస్తూ ఎత్తుబంగారాలు, ఒడిబియ్యం సమర్పిస్తున్నారు. సల్లంగా సూడు తల్లీ అంటూ శరణు ఘోషలతో దిక్కులు పిక్కటిల్లుతున్నాయి. ఇక జాతరలో మూడోరోజు గద్దెలపైన తల్లులంతా కనిపించడంతో భక్తులు ఆనందానికి అవధులు ఉండవు.





# బిజెపి విజయ్ సంకల్పయాత్రకు భారీ సంఖ్యలో తరలిరావాలి



సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్

## జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 22(ప్రభాత ఉదయం) బిజెపి తలపెట్టిన విజయ సంకల్ప యాత్ర లో భాగంగా శుక్రవారం పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలి రావాలని బిజెపి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం రాజేంద్రనగర్ లోని బిజెపి డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో విజయ సంకల్పం యాత్ర పై చర్చించారు. ఈ సందర్భంగా వై శ్రీధర్ మాట్లాడుతూ... కేంద్ర మంత్రి అశ్విని కుమార్ చూబె విజయ్ సంకల్ప యాత్రకు హాజరుకానున్న దృష్ట్యా పార్టీ నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. డివిజన్ బిజెపి అధ్యక్షులు జి బాబు రావు ఆద్వర్యం లో జరిగిన సమావేశంలో రాజేంద్రనగర్ అసెంబ్లీ బిజెపి కన్వీనర్ పొన్న మోని మల్లేష్ యాదవ్ , మూల శ్రీనివాస్ గౌడ్ ,రాహుల్ రెడ్డి ,హరికిషన్ జి ,ఎస్ విఠల్ ,సందీప్ కుమార్ ముదిరాజ్, మల్లేష్ చారి, తదితరులు పాల్గొన్నారు.



బండ్లగూడ మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న కార్పొరేటర్ ప్రవంతి

# టెండర్లు పిలిచిన ఎందుకు పనులు ప్రారంభించారు?

## కార్యాలయం ముందు ధర్నా ధర్నాకు దిగిన కార్పొరేటర్ ప్రవంతి

బండ్లగూడ, ఫిబ్రవరి 22(ప్రభాత ఉదయం) అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచిన పనులు ఎందుకు ప్రారంభించడం లేదని బండ్లగూడ కార్పొరేషన్ కార్పొరేటర్ నాగుల ప్రవంతి నరేందర్ కార్పొరేటర్ ప్రవంతి గురువారం ధర్నాకు దిగారు. కౌన్సిలింగ్ తీర్మానం చేసి పనులు చేపట్టడానికి టెండర్ పిలిచిన ఎందుకు పనులు ప్రారంభించడం లేదని కార్పొరేటర్ ప్రవంతి అధికారులపై మండిపడ్డారు. ప్రజలు పలు సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న అధికారులకు ఎందుకు పట్టనట్లు ఉన్నారని ఆమె ప్రశ్నించారు. తమ డివిజన్ లో జరగనున్న అభివృద్ధి పనులపై అధికారులకు ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినా మాత్రం కమిషనర్ ,డి ఈ, కాంట్రాక్టర్లు పిలిచి పనులు చేపించడం లేదని ఆమె ఆఫీసు వద్ద ధర్నాకు దిగారు.




జర్మన్ టెన్ హాస్పిటల్ లో మాట్లాడుతున్న ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజ నరసింహ

# వైద్య వసతుల్లో హైదరాబాద్‌కు ప్రపంచ గుర్తింపు

## హెల్త్ టూరిజంగా హైదరాబాద్ అభివృద్ధి..

### మంత్రి దామోదర రాజనర్సింహ

రాజేంద్రనగర్,ఫిబ్రవరి22(ప్రభాత ఉదయం) మహా నగరాన్ని ఆరోగ్య టూరిజంగా అభివృద్ధి చేస్తున్నట్లు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు.గురువారం రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ లోని జెర్మన్ టెన్ ఆస్పత్రిలో గురువారం రూ.3.5 కోట్లు విలువైన అత్యాధునిక వైద్య పరికరాలు,బ్రెయిన్,గుండెకు సంబంధించిన స్పెషల్ పరికరాలు,రోబోటిక్ అడ్వాన్స్ మిషన్లను ఆస్పత్రి యజమాన్యంతో కలిసి మంత్రి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ...ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్ నగరాన్ని వరల్డ్ హెల్త్ టూరిజం హబ్ గా మారుస్తున్నట్లు వివరించారు. ప్రపంచంలోని వివిధ దేశాల నుంచి వైద్యం కోసం హైదరాబాద్ కు రావడం అభినందనీయమని కొనియాడారు.నగరానికి మూసీకి ఎంతో విడదీయలేని అనుబంధం ఉందని ఆయన తెలిపారు.ఈ నేపథ్యంలో మూసీ నదిని ఆధునికరించి అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు వివరించారు.ప్రజారోగ్యానికి సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద పీట వేస్తున్నట్లు చెప్పారు. వైద్యుడికి,రోగికి ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. ఆస్పత్రులు,వైద్యులు నైతిక విలువలు పాటించాలన్నారు.ఈ కార్యక్రమంలో జర్మన్ టైం ఆసుపత్రి చైర్మన్ జావేద్ జవార్, డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ జగదీశ్వర్ గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

# అభివృద్ధి పనులను పూర్తిచేయాలని జగదీశ్వర్ గౌడ్‌కు వినతి పత్రం అందజేసిన కాలనీవాసులు

కూకట్‌పల్లి, ఫిబ్రవరి22 (ప్రభాత ఉదయం) మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఆదిత్య నగర్ బస్తీలో గల పలు సమస్యలు , చేపట్టవల్సిన పలు అభివృద్ధి పనులపై బస్తి వాసులు శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మాదాపూర్ డివిజన్ కార్పొరేటర్ వి.జగదీశ్వర్ గౌడ్ ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రానున్న రంజాన్ పండుగను దృష్టిలో పెట్టుకుని మస్జీద్ లకు ఉచిత నీటి ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలని, ఇప్పటికే మంజూరైన పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందన్నారు.

# మంత్రి పదవి కోసం అన్నదమ్ముల మధ్య పోటీ?

మంచిర్యాల, ఫిబ్రవరి22 (ప్రభాత ఉదయం) రాష్ట్ర మంత్రి వర్గంలో మన ఎమ్మెల్యేల్లో ఎవరికి చోటు దక్కుతుందనే ఉత్కంఠ వీడడం లేదు. రాష్ట్రంలో తొలి మంత్రివర్గ కూర్పులో ఉమ్మడి జిల్లా నుంచి ఎవరికీ అవకాశం దక్కలేదు. తాజాగా లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌కు ముందే మంత్రివర్గ విస్తరణ చేపడతారని పార్టీ వర్గాలు ఆశిస్తున్నాయి. ఈ క్రమంలో ఎవరికి కేబినెట్‌లో బెర్త్ దక్కుతుందనే ఆసక్తి అధికార పార్టీతో పాటు ప్రజల్లోనూ ఉంది. ఉమ్మడి జిల్లాలో 10 స్థానాల్లో నాలుగు చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందారు. ఖానాపూర్, మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి స్థానాలు కాంగ్రెస్ ఖాతాలో చేరాయి. పార్టీలో సీనియర్ నాయకుడు, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుకు మొదటి కూర్పులోనే కేబినెట్‌లో చోటు దక్కుతుందనే ప్రచారం జరిగినా అవకాశం రాలేదు. ఇక గడ్డం సోదరులైన బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ కూడా అమాత్య పదవిపై ఆశలు పెట్టుకున్నారు. వీరి ముగ్గురి మధ్య పోటీ నెలకొంది. మాజీ మంత్రి, బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ ఇద్దరూ అన్నదమ్ములు. వీరిరువురూ మంత్రి పదవి కోసం పోటీ పడుతున్నారు. 2004నుంచి 2009 మధ్య చెన్నూరు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మంత్రిగా పనిచేశానని, తనకే మళ్లీ అవకాశం ఇవ్వాలని వినోద్ కోరుతున్నారు. ఇందుకోసం రెండునెలల క్రితమే ఢిల్లీ వెళ్లి ఏఐసీసీ అగ్రనాయకురాలు సోనియా గాంధీని కలిసి విన్నవించారు. ఇక్కడ సీఎం రేవంత్‌రెడ్డిని తరచూ కలుస్తున్నారు. గడ్డం వివేక్ కూడా మంత్రి పదవిపైనే ఆశలు పెట్టుకున్నారు. ఇద్దరూ పదవిపై పోటీ పడుతూ ఎవరి ప్రయత్నం వారు చేస్తున్నారు.



తారక రత్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అభిమానులు

# ఘనంగా నందమూరి తారకరత్న జయంతి వేడుకలు

కూకట్‌పల్లి,ఫిబ్రవరి22 (ప్రభాత ఉదయం) స్వర్గీయ నందమూరి తారకరత్న జయంతి సందర్భంగా బాలయ్య యువసేన ఆధ్వర్యం లో కె పి హెచ్ బి జె ఎన్ టి యు సర్కిల్ వద్ద గల నందమూరి తారక రామారావు విగ్రహం వద్ద నందమూరి తారకరత్న చిత్రపటానికి తినడానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆటో డ్రైవర్లకు, పాదచారులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అట్లూరి దీపక్, పవన్ మార్ని, పొట్లూరి రామకృష్ణ, ఆనంద్, పార్థు, కోటేశ్వర రావు అత్తోట , నందమూరి అభిమానులు, తెలుగుదేశం కార్యకర్తలు పాల్గొన్నారు.




# ఆస్తిపన్ను బకాయిలపై రాయితీ ఇవ్వండి

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ప్రభాత ఉదయం): వన్‌టైమ్ సెటిల్మెంట్(ఓటీఎస్)గా ఆస్తిపన్ను బకాయిల పెనాల్టీలపై 90 శాతం రాయితీ సదుపాయాన్ని మరోమారు కల్పించాల్సిందిగా జీహెచ్ఎంసీ ప్రభుత్వానికి నివేదించింది. జీహెచ్ఎంసీకి ప్రధాన ఆదాయ వనరు ఆస్తిపన్నే. త్వరలో ముగియనున్న ఈ ఆర్థిక సంవత్సర ఆస్తిపన్ను వసూళ్ల లక్ష్యం రూ. 2100 కోట్లు అయినప్పటికీ, గతనెల 20 వరకు రూ.1269 కోట్లు మాత్రమే వసూలయ్యాయి. ప్రస్తుతం జీహెచ్ఎంసీ ఆర్థిక కష్టాల్లో ఉంది. నెలనెలా సిబ్బంది జీతభత్యాల చెల్లింపులకే కష్టమవుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం గతంలో పలు పర్యాయాలు కల్పించిన ఓటీఎస్ సదుపాయాన్ని మరోమారు కల్పించాల్సిందిగా కమిషనర్ ప్రభుత్వానికి లేఖ రాశారు. ఈ స్కీమ్ అమల్లోకి వస్తే ఆస్తిపన్ను బకాయిదారులు అసలుతో పాటు బకాయిల వడ్డీలపై కేవలం 10 శాతం పెనాల్టీ చెల్లిస్తే సరిపోతుంది. అది ఎందరికో వెసులుబాటుగా ఉండటమే కాక జీహెచ్ఎంసీ ఆర్థిక కష్టాల నుంచి గెట్టెక్కేందుకూ ఉపకరిస్తుంది. ఈ అంశాన్ని వివరిస్తూ లేఖ రాశారు. పరిశీలనలోకి తీసుకుని ప్రభుత్వం అవకాశం కల్పించగలదని ఆశిస్తున్నారు.

**ఆస్తిపన్ను బకాయిలు (వడ్డీలపై పెనాల్టీలతో సహా)..**

4,95,628 ప్రైవేట్ యజమానుల భవనాలకు సంబంధించి బకాయిలు రూ.1887.59 కోట్లు కాగా, వడ్డీల పెనాల్టీలతో కలిపి అవి రూ.4522.18 కోట్లకు పేరుకుపోయాయి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన 1800 భవనాల నుంచి రావాల్సిన ఆస్తిపన్ను బకాయిలు రూ. రూ.1622.16 కోట్లు కాగా, వడ్డీల పెనాల్టీలతో సహ అవి రూ.5281.21 కోట్లకు పేరుకుపోయాయి.

అన్నీ వెరసి పేరుకు పోయిన మొత్తం బకాయిలు రూ.9803.39 కోట్లు.

# ధరణి సమస్యలపై కలెక్టర్ల సమావేశం

## ఎజెండా సిద్ధం చేసిన కాంగ్రెస్

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ప్రభాత ఉదయం): ధరణి కమిటీ ఈ నెల 24న కలెక్టర్లతో సమావేశం నిర్వహించనుంది. ఇందు కోసం ఆరు ప్రధాన అజెండాలు సిద్ధం చేసింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ధరణిని రద్దు చేస్తామని అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. అందులో భాగంగానే ధరణి సమస్యల పరిష్కారానికి ఏర్పాటైన కమిటీ మరో కీలక సమావేశం నిర్వహించనుంది. ఈ నెల 24న ఉదయం పది గంటలకు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనుంది. ఈ సమావేశంలో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులు, పెండింగ్‌కు గల కారణాలు, వాటి పరిష్కారానికి చర్యల గురించి చర్చిస్తారు. నిషేధిత ఆస్తులకు సంబంధించిన సమస్యలు, సెక్షన్ 22 A జాబితాపై చర్చిస్తారు. జాబితాను సరిదిద్దడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై స్పష్టతకు వచ్చే అవకాశం ఉంది. తాత్కాలిక ల్యాండ్ ట్రిబ్యునల్స్ ద్వారా పరిష్కరించబడిన కేసులు -అనుభవాలు, ముందుకు వెళ్లే మార్గాలను సమావేశంలో చర్చిస్తారు. సాదాబైనామా దరఖాస్తుల స్థితిని పరిశీలిస్తారు. RSR/Setwar మిస్ మ్యాచ్‌కు సంబంధించిన అంశాలపై ఫోకస్ చేస్తారు. ROR చట్టం, వివిధ స్థాయిలలోని రెవెన్యూ అధికారుల పనితీరు, వివిధ అధికారుల మధ్య ముఖ్యంగా తహశీల్దార్, RDO, JC అధికారాల పంపిణీలో మార్పుల గురించి చర్చిస్తారు. భూమి రిజిస్ట్రేషన్లలో సమస్యల పరిష్కారానికి మార్గాలు అన్వేషిస్తారు. ఇనామ్, జాగీర్ సహా ఇతర చట్టాల కింద భూ వివాదాలు, సమస్యలు, కేసులు, పెండింగ్ అంశాలను త్వరగా పరిష్కరించే మార్గాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో చర్చిస్తారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో భూ సమస్యలపై ఫోకస్ చేస్తారు. రెవెన్యూ- అటవీ వివాదాలపై చర్చిస్తారు. ఎండోమెంట్, వక్ఫ్ భూముల సమస్యలపై దృష్టి సారిస్తారు.




మెరుగైన భూపరిపాలన కోసం రెవెన్యూ పరిపాలనలో మార్పులపై కూడా కలెక్టర్లతో చర్చించే అవకాశం ఉంది. తెలంగాణలో భూ సమస్యలను పరిష్కరించాలంటే ధరణి సాఫ్ట్‌వేర్‌ను మార్చితే సరిపోదని, చట్టాలను కూడా మార్చాల్సి ఉంటుందని ధరణిపై నియమించిన కమిటీ గతంలో అభిప్రాయపడింది. ధరణి సాఫ్ట్‌వేర్‌కు సంబంధించి మాడ్యూల్స్ ఎలా పనిచేస్తున్నాయో కమిటీ తెలుసుకుంది. దరఖాస్తు నుంచి పరిష్కారం వరకు ఏయే దశల్లో సాఫ్ట్‌వేర్ ఎలా పనిచేస్తోందో కమిటీ గత సమావేశాల్లో తెలుసుకుంది. బాధ్యతలన్నీ కలెక్టర్లకు అప్పగించడం వల్ల వస్తున్న సమస్యలు, క్షేత్రస్థాయిలో సిబ్బంది లేకపోవడంతో కలుగుతున్న ఇబ్బందులు, చట్టపరంగా చేయాల్సిన మార్పులపై కమిటీ త్వరలో నిర్ణయం తీసుకోనుందని సమాచారం.

# చెన్నై వేదికగా మార్చి 22న మొదటి మ్యాచ్



## సిరీస్‌పై కన్నేసిన రోహిత్ సేన

### నేటినుండి రాంచీలో నాలుగో టెస్టు



రాజ్‌కోట్‌లో జరిగిన మూడో టెస్టులో ఇంగ్లండ్‌ను 434 పరుగుల తేడాతో ఓడించిన భారత్ ఇప్పుడు మరో కీలక సమరానికి సిద్ధమైంది. రాంచీలోని జెఎస్‌సిఎ ఇంటర్నేషనల్ స్టేడియం కాంప్లెక్స్‌లో నాలుగో టెస్టు కోసం ప్రాక్టీస్ ప్రారంభించింది భారత జట్టు. శుక్రవారం (ఫిబ్రవరి 23) నుంచి మ్యాచ్ ప్రారంభం కానుంది. ప్రస్తుతం ఐదు మ్యాచ్ ల సిరీస్‌లో టీమిండియా 2-1 ఆధిక్యంలో ఉంది. ఈఈ టెస్టు మ్యాచ్‌లో గెలిస్తే, ఇంగ్లిష్ జట్టుతో జరుగుతున్న ద్వైపాక్షిక సిరీస్‌ను భారత్ కైవసం చేసుకుంటుంది. దీంతో ఈ మ్యాచ్‌లోనూ గెలవాలని రోహిత్ సేన పట్టుదలతో ఉంది. ఇందుకోసం తీవ్రంగా ప్రాక్టీస్ చేస్తోంది.దీనికి సంబంధించిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. టీమిండియా ఆటగాళ్లు బుధవారమే రాంచీకి చేరుకుని ప్రాక్టీస్ ప్రారంభించింది. బీసీసీఐ ప్రాక్టీస్ ఫోటోలను షేర్ చేసింది. సర్ఫరాజ్ ఖాన్, యశస్వి జైస్వాల్, రజత్ పటీదార్ వంటి టీమిండియా యువ ఆటగాళ్లు నెట్ సెషన్‌లో చెమటోడ్చారు. రాంచీలో భారత్ ఇప్పటి వరకు కేవలం 2 టెస్టు మ్యాచ్‌లు మాత్రమే ఆడింది. ఒక టెస్టులో విజయం సాధించగా మరొకటి డ్రా అయ్యింది. మార్చి 2017లో ఆస్ట్రేలియాతో జరిగిన ఓ మ్యాచ్ లో 210 ఓవర్లలో 9 వికెట్లకు 603 పరుగులు చేసింది టీమిండియా. రోహిత్ శర్మ తన కెరీర్ బెస్ట్ స్కోరు 212 పరుగులు కూడా ఈ గ్రౌండ్ లోనే చేయడం విశేషం. ఈ మైదానంలో రోహిత్ శర్మ, వృద్ధిమాన్ సాహా, అజింక్య రహానే, ఛెతేశ్వర్ పుజారా తలా సెంచరీ చేశారు. రవీంద్ర జడేజా రెండు టెస్టుల్లో రెండు అర్ధశతకాలు సాధించాడు. అత్యధిక సిక్సర్ల జాబితాలో రోహిత్ శర్మ (6) ఉన్నాడు. అలాగే అత్యధిక వికెట్లు తీసిన ఆటగాళ్లలో రవీంద్ర జడేజా (12 వికెట్లు) ఉన్నాడు.

**భారత టెస్టు జట్టు:**

రోహిత్ శర్మ (కెప్టెన్), యస్సవి జైస్వాల్, శుభ్‌మన్ గిల్, రజత్ పాటిదార్, సర్ఫరాజ్ ఖాన్, ధృవ్ జురెల్ (వికెట్ కీపర్), కేఎస్ భరత్ (వికెట్ కీపర్), దేవదత్ పడిక్కల్, ఆర్ అశ్విన్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్ , కుల్దీప్ యాదవ్, సిరాజ్, ముఖేష్ కుమార్, ఆకాష్ దీప్.

## ఐపీఎల్ 2024 షెడ్యూల్ విడుదల

రిచెస్ట్ క్రికెట్ లీగ్‌కు సమయం ఆసన్నమైంది. మరో నెల రోజుల్లో ఐపీఎల్ 2024 ప్రారంభం కాబోతోంది. మార్చి 22వ తేదీన మొదటి మ్యాచ్ డిఫెండింగ్ ఛాంపియన్స్ చెన్నై సూపర్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య చెన్నైలోని చిదంబరం స్టేడియం వేదికగా జరగనుంది. అనంతరం అహ్మదాబాద్ వేదికగా 2023 సీజన్ ఫైనలిస్ట్ గుజరాత్ టైటాన్స్, హార్దిక్ పాండ్యా కెప్టెన్‌గా వ్యవహరిస్తోన్న ముంబై ఇండియన్స్ అహ్మదాబాద్‌లో తలబడనున్నాయి. మొదటి 17 రోజులకు అనగా మార్చి 22 నుంచి ఏప్రిల్ 7 వరకు జరగబోయే మ్యాచ్‌లకు బీసీసీఐ షెడ్యూల్‌ను ప్రకటించింది. ఇదిలా ఉంటే.. మార్చి 22 - ఏప్రిల్ 7 మధ్య 21 మ్యాచ్‌లు జరగనుండగా.. అందులో నాలుగు డబుల్ హెడ్డర్ మ్యాచ్‌లు ఉన్నాయి. మార్చి 23న మొదటి డబుల్ హెడ్డర్ మ్యాచ్‌ల్లో భాగంగా మధ్యాహ్నం మొహాలి వేదికగా పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ తలబడనున్నాయి. ఇక అదే రోజు కోల్‌కతాలో కోల్‌కతా నైట్ రైడర్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య మ్యాచ్ జరగనుంది. ఇక మార్చి 24 ఆదివారం రాజస్థాన్ రాయల్స్ తమ హోం గ్రౌండ్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌తో తలబడుతుంది. మొదటి ఫేజ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు తన రెండు హోం మ్యాచ్‌లు విశాఖపట్నంలో ఆడనుంది. కాగా, కేంద్ర ఎన్నికల కమిషన్ సార్వత్రిక ఎన్నికలకు తేదీలు ప్రకటించగానే.. మిగిలిన మ్యాచ్‌లకు కూడా షెడ్యూల్ ప్రకటిస్తుంది బీసీసీఐ.




**చెన్నై మ్యాచ్‌లు ఇలా..**

చెన్నై - బెంగళూరు - చెపాక్: మార్చి 22
చెన్నై - గుజరాత్ - చెపాక్: మార్చి 26
చెన్నై - ఢిల్లీ - వైజాగ్: మార్చి 31
చెన్నై - హైదరాబాద్ - హైదరాబాద్: ఏప్రిల్ 5

హైదరాబాద్ మ్యాచ్‌లు ఇలా..

కోల్‌కతా - హైదరాబాద్ - కోల్‌కతా: మార్చి 23
ముంబై - హైదరాబాద్ - హైదరాబాద్: మార్చి 27
గుజరాత్ - హైదరాబాద్ - అహ్మదాబాద్: మార్చి 31



చెన్నై - హైదరాబాద్ - హైదరాబాద్: ఏప్రిల్ 5

బెంగళూరు మ్యాచ్‌లు ఇలా..


చెన్నై - బెంగళూరు - చెన్నై: మార్చి 22
పంజాబ్ - బెంగళూరు - బెంగళూరు: మార్చి 25
కోల్‌కతా - బెంగళూరు - బెంగళూరు: మార్చి 29
లక్నో - బెంగళూరు - బెంగళూరు: ఏప్రిల్ 2

## భారత్‌ను దెబ్బకొట్టేందుకు బరిలోకి ఆలీ రాబిన్సన్





ఐదు టెస్టు మ్యాచ్ ల సిరీస్ లో భాగంగా శుక్రవారం (ఫిబ్రవరి 23) నుంచి భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య నాలుగో టెస్టు మ్యాచ్ ప్రారంభం కానుంది. రాంచీలోని జేఎస్‌సీఏ స్టేడియంలో జరగనున్న ఈ మ్యాచ్ ఇంగ్లండ్‌కు కీలకం. ఎందుకంటే ఇప్పుడు ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో టీమిండియా 2-1 ఆధిక్యంలో ఉంది. 4వ మ్యాచ్‌లో ఇంగ్లండ్ ఓడిపోతే సిరీస్ భారత్ వశమవుతుంది. అందువల్ల బెన్ స్టోక్స్ టీమ్ రాంచీ టెస్టు మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను సమం చేయాల్సి ఉంది. ఇందుకోసం ఇంగ్లండ్ జట్టు బౌలింగ్ లైనప్‌లో గణనీయమైన మార్పు తీసుకురావాలని ప్లాన్ చేసింది. గత రెండు మ్యాచ్‌ల్లో ఆడిన వెటరన్ స్పీడ్‌స్టర్ జేమ్స్ అండర్సన్‌కు నాలుగో మ్యాచ్‌లో విశ్రాంతి ఇచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ సీనియర్ పేసర్ స్థానంలో ఆలీ రాబిన్సన్‌ను బరిలోకి దింపాలని ఇంగ్లాండ్ కూడా యోచిస్తోంది. ఎందుకంటే రాబిన్సన్ గత మూడు గేమ్‌లలో రిజర్వ్ బెంచ్ కే పరిమితమయ్యాడు. అందువల్ల నాలుగో మ్యాచ్‌లో అతడిని ఆడే అవకాశం ఎక్కువగా ఉంది. ఆలీ రాబిన్సన్ ఇప్పటివరకు టీమ్ ఇండియాతో 4 టెస్టు మ్యాచ్‌లు ఆడాడు. మొత్తం 8 ఇన్నింగ్స్‌ల్లో బౌలింగ్ చేసి 21 వికెట్లు పడగొట్టాడు. రెండు సార్లు ఐదు వికెట్లు కూడా తీశాడు. తద్వారా భారత్‌పై రాబిన్‌సన్ అత్యుత్తమ ప్రదర్శనతో రికార్డు సృష్టించాడు. అందువల్ల రాంచీ టెస్టులో ఇంగ్లండ్ జట్టు స్పీడ్‌స్టర్‌ను బరిలోకి దించడం దాదాపు ఖాయం. ఈ నిర్ణయాత్మక మ్యాచ్ లో ఆడబోతున్న ఆలీ రాబిన్సన్ టీమ్ ఇండియాకు ప్రమాదకారిగా మారనున్నాడా లేదా అన్నది తెలియాల్సి ఉంది. ఫిబ్రవరి 23 నుంచి భారత్, ఇంగ్లండ్ మధ్య నాలుగో టెస్టు మ్యాచ్ ప్రారంభం కానుంది. భారత కాలమానం ప్రకారం ఉదయం 9 గంటలకు టాస్ ప్రక్రియ జరగనుండగా, 9.30 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్ ప్రత్యక్ష ప్రసారాన్ని స్పోర్ట్స్ 18 ఛానెల్, అలాగే జియో యాప్‌లోనూ చూడవచ్చు.

## రాంచీ పిచ్‌ని చూసి షాక్‌కు గురైన బెన్ స్టోక్స్!



రాంచీ వేదికగా భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య శుక్రవారం నుంచి నాలుగో టెస్టు ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఇంగ్లీష్ కెప్టెన్ బెన్ స్టోక్స్ పిచ్‌ను పరిశీలించి ఆశ్చర్యపోయాడు. ఇంతకుముందు ఇలాంటి వికెట్‌ను ఎన్నడూ చూడలేదని, మ్యాచ్ జరిగే కొద్దీ ఎలా మారుతుందో చెప్పడం కష్టమని పేర్కొన్నాడు. ఐదు టెస్టుల సిరీస్‌లో ప్రస్తుతం భారత్ 2-1 ఆధిక్యంలో ఉంది. నాలుగో మ్యాచ్‌లో ఇంగ్లండ్ విజయం సాధిస్తే.. సిరీస్ రేసులో నిలుస్తుంది. ఒకవేళ ఓడితే మరో మ్యాచ్ ఉండగానే.. సిరీస్‌ను కోల్పోతుంది. రాంచీ పిచ్‌ని పరిశీలించిన అనంతరం ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ మాట్లాడుతూ 'నేను ఇంతకు ముందెన్నడూ ఇలాంటివి పిచ్ చూడలేదు. మ్యాచ్ జరిగే కొద్దీ పిచ్ ఎలా మారుతుందో చెప్పడం కష్టం. భారత్ కాకుండా ఇతర దేశాల మైదానాల్లో పిచ్ చూసిన వెంటనే ఒక అంచనాకు రావచ్చు. కానీ ఇక్కడ మాత్రం ప్రతి రోజూ ఓ సవాలే. ఇప్పటికైతే పిచ్‌పై పచ్చిక బాగానే ఉంది. కొన్నిచోట్ల పగుళ్లు కూడా కనిపిస్తున్నాయి. బ్యాటింగ్, బౌలింగ్ జట్లకు ఇబ్బందులు తప్పకపోవచ్చు' అని అన్నాడు. ఇది కఠినమైన పిచ్ అని ఇంగ్లండ్ వైస్-కెప్టెన్ ఓలి పోప్ పేర్కొన్నాడు. ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఈ పిచ్‌పై చెలరేగే అవకాశం ఉందన్నాడు.



## డిఫరెంట్‌గా గీతాంజలి మళ్లీ వచ్చేసింది

### శ్మశానంలో టీజర్ లాంచ్ కార్యక్రమం

ఈమధ్య సినిమాల ప్రచారాలు కొంచెం విచిత్ర ధోరణిలోనే వెళుతున్నాయని చెప్పుకోవచ్చు. 'గీతాంజలి మళ్ళీ వచ్చింది' సినిమా చిత్ర నిర్వాహకులు కూడా వైవిధ్యంగా ఉండటం కోసమని ఏకంగా శ్మశానవాటికలోనే తమ సినిమా టీజర్ లాంచ్ చేస్తున్నామని అధికారికంగా ప్రకటించారు. ఈ శనివారం రాత్రి 7 గంటలకు బేగంపేట్ స్మశాన వాటికలో 'గీతాంజలి మళ్ళీ వచ్చింది' టీజర్ లాంచ్ చేస్తున్నాం అని ఆ చిత్ర పీఆర్ మీడియా వాళ్ళకి మెసేజ్ లు పంపాడు. ఈ 'గీతాంజలి మళ్ళీ వచ్చింది' సినిమా ఇంతకు ముందు విడుదలై ఘన విజయం సాధించిన 'గీతాంజలి' కి సీక్వెల్ గా వస్తోంది. ఇందులో అంజలి ప్రధానపాత్రలో నటించింది. శివ తుర్లపాటి దీనికి దర్శకుడు, కోన వెంకట్ కథని సమకూర్చారు, ఈ సినిమా నిర్మాణంలో కూడా భాగం అయ్యారు. ఇంకా ఇందులో శ్రీనివాస్ రెడ్డి, సత్యం రాజేష్, సత్య, షకలక శంకర్, బ్రహ్మాజీ, రవి శంకర్, రాహుల్ మాధవ్ ఇంకా చాలామంది నటీనటులు నటించారు. ఈ సినిమా నటి అంజలికి 50వ సినిమా కావటం ఆసక్తికరం. ఈసారి ప్రచారాలు వినూత్నంగా ఉండాలని చిత్ర నిర్వాహకులు అనుకు న్నారేమో, అందుకని ఈ చిత్ర ప్రచార చిత్రాలు బేగంపేట లోని స్మశానవాటికలో చెయ్యాలని నిర్ణయం తీసుకున్నారు. సినిమా నేపథ్యం హర్రర్ అవటం, ఇందులో దెయ్యాలు, ఆత్మలు లాంటివి ఉండటం మూలాన, స్మశానంలో ప్రచారం చెయ్యాలని నిర్ణయించినట్టుగా తెలుస్తోంది.



## ఎన్టీఆర్‌తో నటించాలని ఉందన్న శ్రీశాంత్





సినిమాతో యంగ్ టైగర్ ఎన్టీఆర్ క్రేజ్ పాన్ ఇండియా స్థాయికి చేరుకున్న విషయం తెలిసిందే. రాజమౌళి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో కొమరం భీంగా అద్భుత నటన కనబర్చి గ్లోబల్ వైడ్ గా పాపులారిటీ సంపాదించుకున్నాడు విదేశాల్లోనూ ఎన్టీఆర్ కి భారీ స్థాయిలో అభిమానులు ఉన్నారు. ఇక ఎన్టీఆర్ ఫ్యాన్స్ జాబితాలో క్రికెటర్స్ కూడా ఉన్నారు. తాజాగా మరో క్రికెటర్ అయితే ఏకంగా ఎన్టీఆర్ తో నటించాలని ఉందంటూ తన మనసులో కోరికను బయటపెట్టాడు. టీమిండియా మాజీ క్రికెటర్ శ్రీశాంత్ తాజా ఇంటర్వ్యూలో జూనియర్ ఎన్టీఆర్ పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తారక్ పై తనకున్న అభిమానాన్ని చూపుతూ తాజా ఇంటర్వ్యూలో శ్రీశాంత్ చేసిన కామెంట్స్ నెట్టింట ట్రెండ్ అవుతున్నాయి. ఈ మేరకు శ్రీశాంత్ మాట్లాడుతూ..' ఎప్పటికైనా ఎన్టీఆర్ తో నటించాలని ఉంది. ఎన్టీఆర్ నటన అంటే నాకు చాలా ఇష్టం. ఆయన డాన్స్ కి నేను పెద్ద ఫ్యాన్ ని. గతంలో ఒకసారి నేను ఎన్టీఆర్ ని కలిసాను. ఆ సమయంలో ఆయనతో మాట్లాడాను. మీరు బాగా డాన్స్ చేస్తారు అని చెప్పాను. దానికి ఆయన థాంక్స్ చెప్పడంతో పాటు సరదాగా ఫ్లైయింగ్ కిస్ కూడా ఇచ్చారు. ఎన్టీఆర్ ని చూస్తే ఎంతో మోటివేట్ గా ఉంటుంది. నేను ఎన్టీఆర్ ని కలిసిన ఈవెంట్లో అల్లు అర్జున్ కూడా ఉన్నారు' అంటూ చెప్పుకొచ్చాడు. ఒకప్పుడు ఇండియన్ బెస్ట్ బౌలర్స్ లో ఒకరిగా పేరు తెచ్చుకున్న శ్రీశాంత్ క్రికెట్ నుంచి రిటైర్డ్ అయిన తర్వాత 2017లో సినీ ఆరంగేట్రం చేశాడు. 'అక్సర్ 2' సినిమాతో బాలీవుడ్ లోకి అడుగుపెట్టాడు. ఆ తర్వాత కొన్ని సౌత్ సినిమాల్లో నటించాడు. చివరగా 'కాతువాకుల రెండు కాదల్' సినిమాలో కనిపించాడు. ప్రస్తుతం బాలీవుడ్ తో పాటు కొన్ని సౌత్ సినిమాల్లో నటిస్తున్నాడు.

## విడుదలకు సి202 హారర్ చిత్రం రెడీ



మైటీ ఒక్ పిక్చర్స్ పతాకం పై తనికెళ్ళ భరణి, శుభలేఖ సుధాకర్, సత్య ప్రకాష్, షఫీ, చిత్రం శీను, వై విజయ ప్రధాన పాత్రలలో నటిస్తోన్న చిత్రం 'సి 202'. మున్నా కాశి హీరోగా నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న ఈ హర్రర్ థ్రిల్లర్ చిత్రానికి మనోహరి కె ఎ నిర్మాత. పూర్తి సినిమా రాత్రిపూట చిత్రీకరించబడిన ఈ సినిమా.. ప్రస్తుతం షూటింగ్ అంతా పూర్తి చేసుకుని నిర్మాణాంతర కార్యక్రమాలలో బిజీగా ఉంది. తాజాగా ఈ చిత్ర ట్రైలర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ ట్రైలర్ విశేషం ఏమిటంటే.. ఒక్క డైలాగ్ కూడా లేకుండా ముఖ్య తారాగణాన్ని చూపిస్తూ.. కేవలం సౌండ్ ఎఫెక్ట్స్‌తో ఉండటం. ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా ఉండటమే కాకుండా.. సినిమాపై అంచనాలను పెంచేస్తోంది. ట్రైలర్ విడుదల సందర్భంగా దర్శకుడు, హీరో అయిన మున్నా కాశి మాట్లాడుతూ.. 'సి 202' ఒక వైవిధ్యమైన కథతో తెరకెక్కించాం. తాజాగా విడుదల చేసిన ట్రైలర్ చూస్తే అందరికీ అది అర్థమవుతుంది. ఒక డైలాగ్ కూడా లేకుండా క్యారెక్టర్‌లను చూపిస్తూ సౌండ్ ఎఫెక్ట్స్‌తో.. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో సినిమాపై ఇంట్రస్ట్ కలిగించేలా ట్రైలర్‌ని కట్ చేశాం. ఈ ట్రైలర్‌ని 'సౌండ్ ఆఫ్ సి 202' అని పిలుచుకుంటున్నాము. ఈ ట్రైలర్‌ని మంచి సౌండ్ సిస్టమ్‌తో చూడండి, ఖచ్చితంగా సినిమా చూడాలనే ఆసక్తి కలుగుతుంది. సినిమా విషయానికి వస్తే.. 'సి 202' చిత్రం ఆద్యంతం రాత్రిపూట చిత్రీకరించబడింది. కథ, స్క్రీన్‌ప్లే చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది. ఈ సినిమాను అద్భుతమైన సస్పెన్స్, భయపడే హారర్ సన్నివేశాలతో.. మంచి థ్రిల్లింగ్ ఎపిసోడ్స్‌తో చిత్రీకరించాము. షూటింగ్ అంతా పూర్తయింది. ప్రస్తుతానికి రామానాయుడు స్టూడియోస్‌లో పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. సాంకేతికంగా మేము హై-ఎండ్ కెమెరాలను మరియు మంచి లైటింగ్ పరికరాలను ఉపయోగించాము. ఈ సినిమాలో తనికెళ్ళ భరణి, శుభలేఖ సుధాకర్, సత్య ప్రకాష్, షఫీ, చిత్రం శీను, వై విజయ వంటి సీనియర్ నటులు ప్రధాన పాత్రలు పోషించారు. వీరంతా ఇప్పటి వరకు చేయని పాత్రలో నటించి ప్రేక్షకులను థ్రిల్ చేయబోతున్నారు. ఈ చిత్రంలో 21 నిమిషాల పాటు గ్రాఫిక్స్ ఉంటాయి. అవన్నీ ప్రేక్షకులను మెస్మరైజ్ చేస్తాయి.. త్వరలోనే చిత్ర విడుదల తేదీని ప్రకటిస్తామని తెలిపారు.



## మహేశ్ బాబుకు కొత్తగా మేకోవర్

### కొత్త సినిమా షూట్‌తో రాజమౌళి ఆంక్షలు



కొత్త సినిమా కోసం మహేశ్ బాబును కొత్తగా చూపాలని స్టార్ డైరెక్టర్ రాజమౌళి యోచిస్తున్నారు. అందుకోసం మహేశ్ బాబును కేవలం షూటింగ్‌కే పరిమితం చేయాలని, బయటకనపకుండా చూడాలిన అనుకుంటున్నాడట. అందుకే అతను ఇక పబ్లిక్ గా కనిపించరాదని ఆంక్షలు పెట్టారని టాక్ నడుస్తోంది. మహేష్ బాబు ఎలాంటి ఈవెంట్స్ కు కానీ, మూవీ ఫంక్షన్స్ కు హాజరుకాకూడదని ఆదేశాలు జారీ చేశారట. ఇప్పుడు ఇదే న్యూస్ టాలీవుడ్ లో చక్కర్లు కొడుతుంది. ఇకపై మహేష్ బాబు పబ్లిక్‌గా కనిపించకూడదని ఎస్ఎస్ రాజమౌళి చెప్పినట్లు టాక్ వినిపిస్తుంది. మహేష్ బాబు, రాజమౌళి కాంబినేషన్స్ లో సినిమా రాబోతున్న విషయం తెలిసిందే.. ఈ సినిమా కోసం మహేష్ బాబు అభిమానులు ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఈ మూవీ ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సినిమా పాత్ర కోసం మహేష్ బాబు గెటప్ మార్చనున్నారు. అలాగే బాడీ బిల్డింగ్ కూడా చేయబోతున్నాడు. ఆయన కొత్త గెటప్ ఎలా ఉంటుందో జనాలకు తెలియకూడదు. అందుకే మహేష్ బాబు పబ్లిక్‌గా కనిపించవద్దని రాజమౌళి రూల్ పెట్టారని టాక్. మిగతా దర్శకులతో పోలిస్తే రాజమౌళి వర్క్ స్టైల్ చాలా డిఫరెంట్ గా ఉంటుంది. జక్కన్న సినిమాలు తీయడానికి చాలా సమయం తీసుకుంటాడు. అందుకు తగ్గట్టుగానే హీరోల లుక్స్ ను కూడా మార్చేస్తుంటారు ఇప్పుడు మహేష్ బాబు లుక్ ను కూడా మారుస్తున్నారట దర్శకుడు రాజమౌళి. అందుకు తగ్గట్టుగానే మహేష్ బాబు విదేశాలకు వెళ్లి మరీ శిక్షణ పొందుతున్నాడు. మహేష్ బాబు నటించిన 'గుంటూరు కారం' సినిమా హిట్ అయినా కూడా అది మహేష్ బాబు అభిమానులకు ఆశించిన స్థాయిలో కిక్ ఇవ్వలేకపోయింది. ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమా మహేష్ బాబు కెరీర్‌లోనే బి÷-గగెస్ట్ మూవీగా నిలవనుంది. రాజమౌళి ఈసారి తన టెక్నికల్ టీమ్ లో కొన్ని మార్పులు చేయనున్నాడని అంటున్నారు. దాంతో సినీవర్గాల్లో క్యూరియాసిటీ మరింత పెరిగింది.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.